సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ◆ 28 ◆ అక్టోబర్ ◆ 2024



విజేత మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లా లీగ్ కం నాకౌట్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది.

వివరాలు 8లో ▸



సుంకేసులకు వరద

సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 20,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /16.1

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

వి'పత్తి'..!

వరుస వర్షాలతో తగ్గిన దిగుబడి

వరుస వర్షాలు.. సోకిన తెగుళ్లు వెరసి ఈ సారి పత్తి దిగుబడి అమాంతంగా తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే రేటు కూడా పడిపోయింది. నష్టం తప్పదని తెలిసినా.. కనీస పెట్టుబడి వస్తుందనే ఆశతో పత్తి ఏరేందుకు ఉపక్రమించిన రైతులకు కూలీల కొరత గుదిబండగా మారింది. ఇన్ని కష్టాలకు ఓర్చి, ఎక్కువ మొత్తం చెల్లించి పత్తి బస్తాలను సీసీఐ కేంద్రానికి తరలిస్తే.. అక్కడా తేమ పేరిట కొర్రీలే ఎదురవుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్న రైతులు.. వారి చేతిలో నిలువునా మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెల్లబంగారం సాగు చేసిన రైతులు అనుభవిస్తున్న నరకయాతనపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

గ్రౌండ్ రిపోర్ట్

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- గత ఏడాదితో పోలిస్తే పడిపోయిన ధర
- మరోవైపు పీడిస్తున్న కూలీల కొరత
- రైతులకు భారంగా మారిన అదనపు చెల్లింపులు
- సీసీఐ కేంద్రాల్లో తేమ పేరిట కొర్రీలు
- దళారుల చేతిలో చిక్కి మోసపోతున్న రైతులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు **పేరు వరసింహులు. ఇతనికి నారాయణపేట జిల్లా మరికల్‌లో** ఆరు ఎకరాల పొలం **ఉండగా పత్తి** సాగు చేశాడు. పంట చేతికి **వచ్చే సమయం**లో వర్షాలు కురుస్తుండడం**తో పత్తి చేనులోనే నల్లగా మారుతోందని** ఆందోళన వ్యక్తం చేశాడు. ముందు జాగ్రత్తగా పత్తి ఏరుదామంటే కూలీల కొరత వేధిస్తోంది. ఒక్కో కూలికి రూ.500 చొప్పున చెల్లించి పత్తి తీయించుకుంటున్నారు. మరీ కూలీలు దొరకని పరిస్థితుల్లో కిలోకు రూ.10 చొప్పున చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశాడు. ఎకరాకు రూ.15 వేలు ఖర్చు కూలీలకు అవుతుందని రైతు తెలిపాడు.

సోకిన తెగుళ్లు.. తగ్గిన దిగుబడి

ఈ వానాకాలం సీజన్‌లో మొదట వర్షాభావ పరిస్థితులు నెలకొనగా.. సరైన సమయంలో పత్తి విత్తులు నాటలేదు. ఆ తర్వాత అనుకూలించినప్పటికీ వరుస వర్షాలతో పత్తికి నష్టం వాటిల్లింది. చేలల్లో నీరు నిల్వడంతో అనేక రకాల ఎర్రకుళ్లు వంటి తదితర తెగుళ్లు ఆశించాయి. ఈ క్రమంలో దిగుబడి అమాంతంగా తగ్గింది. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. కానీ ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు.

పీడిస్తున్న కూలీల కొరత..

తెగుళ్ల ప్రభావంతో దిగుబడి తగ్గడం ఒక వైపు కాగా.. పత్తి చేతి కందే సమయంలో కూలీల కొరత రైతులను వేధిస్తోంది. కొన్ని చోట్ల రోజుకు ఒకరికి రూ.450 చొప్పున ఇస్తామన్నా.. కూలీలు దొరకడం లేదని చెబుతున్నారు. దీంతో తమ కుటుంబ సభ్యులతోనే పత్తి ఏరుతున్నామని.. వర్షం వస్తే ఇది కూడా మిగలదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల వర్షం భయంతో ఇతర మండలాలకు చెందిన కూలీలకు ఎక్కువ మొత్తం చెల్లించి.. వాహనాలల్లో చేళ్లకు తరలిస్తున్నారు. పెరిగిన కూలి, ఆటో కిరాయి వంటి అదనపు ఖర్చులు మరింత భారంగా మారడంతో రైతులు లబోదిబోమంటున్నారు.



అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లి శివారులో నల్లబారిన పత్తికాయలు

జిల్లాల వారీగా పత్తి సాగు, దిగుబడి అంచనా..

జిల్లా	సాగు (ఎకరాలు)	దిగుబడి అంచనా (క్వింటాళ్లు)
నాగర్‌కర్నూల్	2,18,395	26,20,680
నారాయణపేట	1,65,150	9,90,900
జోగుళాంబ గద్వాల	1,29,000	12,91,000
మహబూబ్‌నగర్	81,277	6,79,130
వనపర్తి	14,243	1,28,190

సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు ఇలా (క్వింటాల్ ధర రూ.లలో..)

తేమ	కొనుగోలు ధర
8 శాతం	7,521.00
9 శాతం	7,445.79
10 శాతం	7,370.58
11 శాతం	7,295.37
12 శాతం	7,220.16

(తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉంటే కొనుగోలు చేయడం లేదు)

గత ఏడాది ఇదే సీజన్‌లో పత్తికి భారీ ధర పలికింది. సీసీఐ క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు ధర ప్రకటించగా.. అదే బహిరంగ మార్కెట్‌లో దళారులు క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.10 వేలతో కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఎక్కువ మొత్తంలో దళారులకే విక్రయించారు. ప్రస్తుతం బహిరంగమార్కెట్‌లో ధర అమాంతంగా పడిపోయింది.

పడిపోయిన ధర.. దళారుల దగా

దళారులు క్వింటాల్‌కు రూ.6 వేల నుంచి రూ.6,500 ధరతో మాత్రమే కొనుగోలు చేయడంతో పాటు తక్కువ తూకంతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు సీసీఐ కేంద్రాల వైపు చూస్తున్నా.. తేమ 8 నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని, ఆధార్ అథెంటిఫికేషన్ వంటి కొర్రీలు వారికి ప్రతిబంధకంగా మారాయి. అంతేకాదు సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకెళ్లే వాహనం, హమాలీ ఖర్చులు తడిసిమోపెడు కావడంతో విధిలేక ఊళ్లోనే దళారులకు విక్రయిస్తున్నారు.

పెట్టుబడి కూడా రాని పరిస్థితి..

ఎకరా పత్తిలో కలుపుతీతకు రూ.6 వేలు, దున్నేందుకు రూ.1,500, గుంటుకకు (మొదటి నుంచి చివరి వరకు) రూ.11,200, విత్తులు నాటేందుకు రూ.వెయ్యి, విత్తనాలకు రూ.2,400, మందులకు రూ.8 వేలు, కలుపు, ఎరువులు వేసే కూలీలకు రూ.2 వేలు, పత్తి ఏరేందుకు రూ.10 వేలు.. మొత్తంగా రూ.41,100 ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తేమ, రంగు మారిన నేపథ్యంలో క్వింటాల్‌కు మార్కెట్‌లో రూ.6,500 మాత్రమే ఇస్తున్నందున పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ కొర్రీలు పెట్టకుండా ధర పెంచి కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.

రాయచూర్ నుంచి కూలీలు..



మా దగ్గర పత్తి అధికంగా సాగు చేయడంతో ఇతర ప్రాంతంలో నుంచి పత్తి తీయడానికి కూలీలు వస్తుంటారు. ఈసారి నాకున్న 15 ఎకరాలతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని మొత్తం 30 ఎకరాలు పత్తిని సాగు చేశాను. గతంలో లాగే పత్తి ఏరడానికి ఆంధ్ర, రాయచూర్ నుంచి కూలీలు వచ్చారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించి కిలో పత్తి ఏరేందుకు రూ.10 చెల్లిస్తున్నాం. దీంతో పెట్టుబడులు అధికం అవుతున్నాయి.

- శేఖర్, రైతు, పుట్టపల్లి

స్థానిక కూలీలు సరిపోవడం లేదు



కౌకుంట్ల మండల పరిధిలో నల్ల రేగడి భూములు అధికంగా ఉండటంతో పెద్ద మొత్తంలో పత్తి సాగు చేస్తాం. అందరి చేనుల్లో పత్తి ఎరడానికి ఒకేసారి రావడంతో స్థానికంగా కూలీలు సరిపోవడం లేదు. దీంతో ఖర్చులను భరిస్తూ ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పిస్తున్నాము. ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లిస్తున్నాం.

- నరేష్, రైతు, కౌకుంట్ల

5 వేలు ఇస్తరంట

పత్తి తీద్దామంటే రోజు వర్షం కురుస్తోంది. వర్షం తెరిపిస్తే పత్తి తీస్తున్నాం. తీసిన పత్తి నల్ల బారడం వల్ల ఎవరూ కొనడం ముందుకు వస్త లేరు. కొనేందుకు ముందుకు వచ్చిన తక్కువ ధర అడుగుతున్నారు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే మద్దతు ధర వచ్చేది. బయట క్వింటాల్‌కు రూ.5 వేలు ఇస్తమంటున్నారు. ఈ ధరకు దిగుబడి తక్కువగా ఉండటం వల్ల అమ్ముకుంటే ఎకరాకు పెట్టిన పెట్టుబడుల్లో రూ.25 వేల వరకు నష్టం వస్తోంది.



- బాలమణి, జంగంరెడ్డిపల్లి, అమ్రాబాద్ మండలం

ఉన్నత విద్యకు ఊతం

పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం



- ఇంజనీరింగ్‌లో మూడు.. లా విభాగంలో రెండు కోర్సులు
- ఒకట్రెండు రోజుల్లో వెలువడనున్న ఉత్తర్వులు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు
- సుమారు 100కుపైగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం



సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మరో మైలురాయిని అందుకోనుంది. గత కొన్నేళ్లుగా యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వెలువడుతున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరులో ఉన్నత విద్యకు ఊతమిచ్చేలా రెండు కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ రెండు కళాశాలల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమోదానికి సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. ఈ రెండు కళాశాలల్లో కూడా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లు ఇవ్వనున్నారు. వీటికి పూర్తిస్థాయిలో రెగ్యులర్ స్టాఫ్‌ను కూడా కేటాయించనున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న 5 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు, వనపర్తి, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలను పీయూ పరిధిలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.

వందకుపైగా పోస్టులు..

పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటులో రెండు విషయాలు కీలకంగా మారనున్నాయి. ఒకటి భవనం కాగా.. మరోటి సిబ్బంది కేటాయింపు. ప్రస్తుతం రీసెర్చ్ ఫెసిలిటీ భవనంలో నిర్మించనున్న గదుల్లో తరగతులు కొనసాగనున్నాయి. ఇక విద్యార్థుల హాస్టల్ విషయానికి వస్తే లా విద్యార్థులకు ఉన్న రెండు బాల, బాలికల హాస్టల్స్‌లో సర్దుబాటు చేయనున్నట్లు తెలుస్తుంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు మరో హాస్టల్ నిర్మించే అవకాశం ఉంది. ఇక రెండు కళాశాలల్లో కూడా పూర్తిస్థాయిలో 100కుపైగా పోస్టులను మంజూరు చేయనున్నట్లు సమాచారం. ఇందులో సుమారు 45కు పైగా టీచింగ్, మిగతా 55 పోస్టులు నాన్ టీచింగ్ పోస్టులు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం రెగ్యులర్ సిబ్బందిని కేటాయిస్తున్న నేపథ్యంలో కోర్సులను కూడా సెల్ఫ్ ఫైనాన్స్ కాకుండా, రెగ్యులర్ కోర్సులుగా పరిగణించి నామమాత్రపు ఫీజులు వసూలు చేయనున్నట్లు సమాచారం.

ఉద్యోగ కల్పిత కోర్సులు..

పీయూలో ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటు నేపథ్యంలో ఉద్యోగ ఉపాధి ఆధారిత కోర్సులను ఇందులో ప్రవేశపెట్టనున్నారు. మొత్తం మూడు కోర్సుల్లో మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి కోర్సులు ఉన్నాయి. మొదటి సంవత్సరం ప్రతి కోర్సులో 60 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనుండగా.. మొత్తం 180 మంది విద్యార్థులు చేరనున్నారు. సీట్లను ఐఐటీ లేదా ఎంసెట్ ప్రవేశ పరీక్షల ద్వారా భర్తీ చేయనున్నారు.

■ లా కళాశాలలో బ్యాచులర్ ఆఫ్ లా, మాస్టర్ ఆఫ్ లా వంటి కోర్సులు ఉన్నాయి. ఈ సీట్లను లా సెట్ ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు. ప్రతి కోర్సులో 30 మంది చొప్పున మొత్తం 60 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు. అయితే వీటికి సంబంధించి అడ్మిషన్లు వచ్చే విద్యా సంవత్సరం నుంచి చేపట్టనున్నారు.

సంతోషంగా ఉంది..

పీయూలో లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉండగా వాటికి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు తెలుస్తుంది. ఇది చాలా సంతోషకరమైన విషయం. ఇదే విషయమై హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపాం. కళాశాలల ఏర్పాటుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి.

– జీఎన్ శ్రీనివాస్, పీయూ వైస్‌చాన్స్‌లర్

న్యూస్‌రీల్

నేడు, రేపు నీటి సరఫరా నిలిపివేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భూత్పూర్ మండలంలోని శేరిపల్లి(బి) స్టేజీ వద్ద రోడ్డు వైడెనింగ్ కారణంగా మిషన్ భగీరథ పథకం పైపులైన్ మారుస్తున్నందున మల్లెబోయినపల్లిలోని నీటిశుద్ధి కేంద్రానికి 40గంటల పాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నామని ఎస్ఈ పుట్టా వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. సోమవారం ఉదయం 6గంటల నుంచి మంగళవారం రాత్రి 10గంటల వరకు మరమ్మ తు పనులు కొనసాగుతాయన్నారు. ముఖ్యంగా జడ్చర్ల మున్సిపాలిటీతోపాటు దివిటిపల్లి 2బీహెచ్‌కేకు తాగునీటి సరఫరాలో అంతరా యం కలుగుతుందన్నారు. దీనికి ఆయా ప్రాంత ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఒక డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో అసంతృప్తి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం 5 డీఏలు ప్రకటిస్తుందని భావిస్తే.. ఒక్క దానితో సరిపెట్టడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కోశాధికారి కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని పది నెలలు వేచిచూశామన్నారు. వినిమయ ధరల సూచీకి అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాలు ప్రకటిస్తాయని, కానీ గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని మరిచాయని ఆరోపించారు. ఇవ్వాల్సిన సమయంలో ఇవ్వకుండా పండుగలప్పుడు కానుకలుగా ఇస్తున్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహిళల హక్కుల సాధన కోసం సమరానికి సిద్ధం కావాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మహిళల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలిగా భార్గవి, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, ఉపాధ్యక్షురాలిగా ఇందిర, సహాయ కార్యదర్శిగా సత్యమ్మ, కోశాధికారిగా కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులుగా జ్యోతి, పద్మతోపాటు మరో 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న ఈ సమాజంలో మహిళలపై దాడులు, అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలు ఇటు కుటుంబంలో, అటు రాజకీయ రంగాల్లో తీవ్రమైన వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అనేది కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగపడుతుందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

- ఏటీసీలో 6 కొత్త కోర్సులు ప్రారంభం
- ఐటీఐ (బాలికల) కళాశాలలో మొత్తం 172 సీట్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని ఐటీఐ (బాలికల) కళాశాల ప్రాంగణం అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ సెంటర్ (ఏటీసీ) లో వచ్చే నెల 25 నుంచి ఆరు కొత్త కోర్సులు ప్రారంభం కానున్నాయి. వీటిలో ప్రవేశం పొందేందుకు అర్హత గల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ మొబైల్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అదేరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్ హాజరుకావాలి. జిల్లాలోని విద్యార్థినులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదువుకున్న నిరుద్యోగులకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలు పెంపొందింపజేసి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో మొత్తం 172 సీట్లు ఉన్నాయన్నారు. సంవత్సరం వ్యవధి కలిగిన మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. రెండేళ్ల వ్యవధి కలిగిన బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్), అడ్వాన్స్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులు చేయవచ్చన్నారు. అభ్యర్థులు ముందుగానే ఒరిజినల్ పదో తరగతి మెమో, కుల, స్థానిక ధ్రువీకరణ పత్రాలు, బోనోఫైడ్, టీసీ సర్టిఫికెట్లు తమ ఫొటో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే దరఖాస్తు ప్రింటెండ్ కాపీతోపాటు ఈ సర్టిఫికెట్లు తీసుకుని నేరుగా మహబూబ్‌నగర్‌లోని బాలికల ఐటీఐలో హాజరుకావాలన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- జూనియర్ విభాగంలో మూడు రోజుల టోర్నీ
- రెండు కోర్టుల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు



- వివరాలు 8లో..

రెవెన్యూ డివిజన్ చేయాలని విజ్ఞప్తి

జడ్చర్ల: జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి జడ్చర్లకు అన్ని అర్హతలు ఉన్నాయని, రెవెన్యూ విడిజన్ ఏర్పాటుతో భూ సమస్యలు సకాలంలో పరిష్కారమవుతాయని, అలాగే ప్రభుత్వ భూములు, గైరాన్, అసైన్డ్, దేవాదాయ శాఖ తదితర భూముల పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. అంతేగాక జడ్చర్ల మీదుగా ఒకవైపు 44వ నంబర్, మరోవైపు 167వ నంబర్ జాతీయ రహదారులు వెళ్తున్నాయని, రైలు మార్గం ఉండడం జడ్చర్ల ప్రత్యేకతగా ఉందన్నారు. ఇక్కడ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది వచ్చి ఉపాధి పొందుతున్నారని, స్థానికేతరుల జానాభనే దాదాపు 5 లక్షల దాకా ఉంటుందన్నారు. అలాగే నవాబ్‌పేట మండలంలోని కొల్లూరును మండలం చేయడంతోపాటు జడ్చర్ల రూరల్ మండలం అదనంగా ప్రకటించాలని, బాలానగర్‌ను మున్సిపాలిటీ చేయాలని, జడ్చర్ల అభివృద్ధికి నిధు లు మంజూరు చేయాలని కోరారు. తమ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన రెవెన్యూ డివిజన్లు, మండలాలకు సంబంధించి ఒక అధికారిక కమిటీ వేస్తామని, నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారని ఎమ్మెల్యే వెల్లడించారు.

భారీగా మొక్కజొన్న

నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం భారీగా మొక్కజొన్న వచ్చింది. మార్కెట్‌కు సుమారు 7,310 బస్తాల మొక్కజొన్న వచ్చిందని మార్కెట్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. కాగా మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,502, కనిష్టంగా రూ.1,812 ధర పలికిందని ఆయన వివరించారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: గతంలో సీఎం ప్రకటించిన విధంగా రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధతతో కూడిన నిబంధనలు, నిధులు, కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్‌లో ఆదివారం రెడ్డి సేవాసమితి ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్షలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని కోరారు. రెడ్డిసేవా సమితి నుంచి రెడ్డి విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇద్దరు వైద్య, 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.10 వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా వైద్య సహాయం కోసం రెండు రెడ్డి కుటుంబాలకు రూ.30 వేలు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, సహ అధ్యక్షుడు ధనంజయరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మేఘారెడ్డి, నీలంరెడ్డి, మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సరస్వతి, వంశీలత, స్వరూప, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల క్రికెటర్లకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న శాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రికెట్‌లో తెలంగాణ జిల్లాల క్రీడాకారులకు న్యాయం చేయాలని తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్ క్రీడాకారుడిగా, శాట్ చైర్మన్‌గా ఆరేళ్లపాటు తనవంతు క్రీడాభివృద్ధికి కృషిచేశానన్నారు. తెలంగాణ జిల్లాల్లోని క్రికెట్ క్రీడాకారులను హెచ్‌సీఏ పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు 216 క్లబ్‌లు ఉంటే.. జిల్లాలకు కేవలం 8 జట్లు ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రం ఏర్పడినప్పుడు నూతన అసోసియేషన్ ఏర్పాటు, గుర్తింపు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ క్రీడాకారులను న్యాయం చేయాలనే ఉద్దేశంతో టీడీసీఏ ఏర్పడిందన్నారు. టీడీసీఏ ఆధ్వర్యంలో గ్రామీణ క్రికెటర్ల నైపుణ్యాన్ని వెలికితీయడానికి టోర్నమెంట్‌లు నిర్వహిస్తామన్నారు. జిల్లాల క్రీడాకారుల న్యాయం కోసం అవసరమైతే ధర్నాలు, ఆందోళనలు చేపడుతామన్నారు. అలాగే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రతి క్రికెట్ క్రీడాకారుడు హెచ్‌సీఏ చేస్తున్న అన్యాయాలపై ప్రశ్నించాలని, టీడీసీఏకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ క్రీడాకారులు రఘువర్ధన్‌రెడ్డి, నవీన్ కుమార్, ఎండీ రియాజుద్దీన్, రాంచందర్, నాగిరెడ్డి, నవాజ్‌షా, ఎండీ రషీద్, వెంకటరమణ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి


మన్యంకొండ(ఫైల్)

కొత్తకోట రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన పెద్ద మందడి మండలం మద్దిగట్లలో ఆదివారం వెలుగు చూసింది. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన మత్స్యకారులు వెల్టూర్ శివారులోని బుగ్గిచెరువులో చేప పిల్లలు వదిలారు. గ్రామానికి చెందిన వాకిటి పెద్ద మన్యంకొండ (64) చెరువు కాపలాకు శనివారం రాత్రి వెళ్లాడు. చెరువు సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద ప్రమాదశాత్తు తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు దగ్గరకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించడంతో బోరున విలపించారు. కుమారుడు సురేశ్ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మన్యంకొండ భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


పట్నం శివ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. అడ్డాకుల మండలం కందూరుకు చెందిన గొడుగు జ్యోతి కుటుంబం కొన్ని రోజులుగా జీవనోపాధి నిమిత్తం కల్వకోల్‌లో నివాసముంటున్నారు. శనివారం రాత్రి కల్వకోల్‌కు చెందిన పట్నం శివ (21) తమ ఇంటి వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని జ్యోతి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వారు అక్కడికి వెళ్లగా.. అప్పటికే శివ మృతి చెంది కనిపించాడు. అతడి మృతిపై తల్లిదండ్రులు లక్ష్మి, శ్రీనివాసులు అనుమానాలను వ్యక్తం చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు


మెయిన్ స్టేడియంలో ఖోఖో టోర్నీ ఏర్పాట్లు

- జూనియర్ విభాగంలో మూడు రోజుల టోర్నీ
- రెండు కోర్టుల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు
- 365 మంది క్రీడాకారులు, 25 మంది అఫీషియల్స్ రాక

అందరి సహకారంతో..

ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీ నిర్వహించనున్నాం. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తాం. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహిస్తాం.

– జీఏ విలియమ్స్, ప్రధాన కార్యదర్శి ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్, మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు వేదికకానుంది. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం నుంచి బుధవారం వరకు రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్ జిల్లాల ఖోఖో చాంపియన్‌షిప్ జరగనుంది. పోటీల్లో రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికలు పాల్గొననున్నారు. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల నుంచి 365 మంది క్రీడాకారులు, 25 మంది అఫీషియల్స్ హాజరవుతున్నారు. టోర్నీలో పాల్గొనే బాలికలకు మాడ్రన్ స్కూల్, బాలురకు చైతన్య స్కూల్, మెయిన్ స్టేడియం, బీపీహెచ్ఎస్ పాఠశాలల్లో వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. క్రీడాకారులందరికీ బాలభవన్‌లో భోజన వసతి కల్పించనున్నారు.

లీగ్ కం నాకౌట్ పద్ధతిలో..

రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. దాదాపు 80 లీగ్ మ్యాచ్‌లు.. పగలు, సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు మెయిన్ స్టేడియంలో ప్రారంభం కానున్న టోర్నీకి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

అండర్–23 విజేత మహబూబ్‌నగర్


విన్నర్ మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎండీసీఏ ప్రతినిధులు

- రన్నరప్‌గా నిలిచిన నాగర్‌కర్నూల్
- ముగిసిన ఉమ్మడి జిల్లా టోర్నమెంట్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని క్రికెట్ మైదానంలో జరుగుతున్న అండర్– 23 ఉమ్మడి జిల్లా లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్‌లో మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 203 పరుగుల తేడాతో నాగర్‌కర్నూల్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 308 పరుగులు చేసింది. జట్టులో అక్షయ్ అద్భుతమైన సెంచరీతో రాణించాడు. 104 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్స్‌తో 118 పరుగులు చేశాడు. అబ్దుల్‌రాఫే మరోసారి అద్వితీయమైన ఇన్నింగ్స్ ఆడాడు. 91 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్‌తో 95 పరుగులు చేశాడు. నాగర్‌కర్నూల్ బౌలర్లు అభినవ్‌తేజ 2, ఆఫ్రిది 2, జస్వంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 24.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ బౌలర్లు మహ్మద్ ముఖిత్ 3, అర్జున్ 2, దినేష్ 2 వికెట్లు తీశారు. టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అక్షయ్ (246 పరుగులు), బెస్ట్ బౌలర్‌గా మహ్మద్ ముఖిత్ (8 వికెట్లు), బెస్ట్ ఆల్‌రౌండర్‌గా అబ్దుల్‌రాఫే (197 పరుగులు, 5 క్యాచ్‌లు) నిలిచారు.

ట్రోఫీలు అందజేసిన ఎండీసీఏ ప్రతినిధులు

అండర్– 23 టోర్నీ రన్నర్, విన్నర్ జట్లకు ఎండీసీఏ ప్రతినిధులు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆరు జట్లతో టోర్నమెంట్ నిర్వహించినట్లు చెప్పారు. ఇలాంటి టోర్నీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, సభ్యుడు కృష్ణమూర్తి, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ సబ్‌జూనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు

జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సబ్‌జూనియర్స్ జట్టును ఆదివారం పట్టణంలోని స్టేడియం మైదానంలో ఎంపిక చేశారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీ, ఎంపికలో 60 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభకనబర్చారు. వారిలో లావణ్య, సౌజన్య, దీక్షిత, బింధుప్రియ, నాగవైష్ణవి, భవిత, శ్రీవల్లి, నందిని, సంధ్య, సన్ని, అనూష, శ్రీజ, దివ్య, గీత, నందిని, సౌమ్య ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ 2 నుంచి ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనేందుకు జట్టు వెళ్లనుంది. ఎంపికైన క్రీడాకారులను ఫ్లెవైక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి అభినందించారు. జట్టు వెళ్లేందుకు అవసరమైన రవాణా ఖర్చులు రూ.5 వేలు ఆయన అందజేస్తానన్నారు.

అండర్–14 ఖోఖో జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్– 14 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు దాదాపు 300 మంది హాజరైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి తెలిపారు. జిల్లా జట్లను త్వరలో కోయిలకొండలో జరిగే ఉమ్మడి జిల్లా ఎంపికలకు పంపిస్తామని చెప్పారు.

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి


ఉమ్మడి జిల్లా నూతన ఉషా కమిటీకి ఎన్నికపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఉషూ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జాయింట్ సెక్రటరీ, పరిశీలకుడు మహ్మద్ ఇమ్రాన్, కోశాధికారి ఎస్.పరమేశ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ పరిశీలకుడిగా బాలరాజు, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్నవీరయ్య సమక్షంలో ఉమ్మడి జిల్లా నూతన ఉషూ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జహంగీర్‌పాష ఖాద్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ వాజిద్‌అలీ, కోశాధికారిగా సాలంబిన్ ఉమర్, ఉపాధ్యక్షులుగా కనకంయాదవ్, జి.కృష్ణయ్య, అబ్దుల్ నబీ, ఎండీ ఇస్మాయిల్, సంయుక్త కార్యదర్శులుగా కేశవ్‌గౌడ్, నాగరాజు, గోపాల్, సయ్యద్ ఖలీల్, సురేందర్, ఎండీ అర్బాత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎర్రోళ్ల వెంకటస్వామి, శివకుమార్, వెంకటేశ్, మోసీన్, అర్ష్ జమీల్‌లను ఎన్నికయ్యారు. ఈ రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఉషూ క్రీడలో జిల్లాలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉషూను జిల్లావ్యాప్తంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం నూతన అసోసియేషన్ సభ్యులను పలువురు ఘనంగా సన్మానించారు.

అనుమానం.. పెనుభూతమై



గాయపడిన నిర్మలమ్మ, లక్ష్మమ్మ

- కట్టుకున్న భార్యపై వేటకొడవలితో భర్త దాడి
- అడ్డొచ్చిన అత్తపై సైతం దాడి.. పరిస్థితి విషమం

దేవరకద్ర రూరల్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. వేట కొడవలితో దాడిచేసి హతమార్చేందుకు యత్నించాడు. ఈ క్రమంలో కూతురిని కాపాడుకునేందుకు వెళ్లిన తల్లిపై కూడా దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన దేవరకద్ర మండలం గుడిబండలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. గుడిబండకు చెందిన నిర్మలమ్మకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అందులో పెద్ద కూతురైన లక్ష్మమ్మను 15 ఏళ్ల క్రితం మదనాపురం మండలం కొన్నూరుకు చెందిన కురుమూర్తికి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ముగ్గురు సంతానం కాగా.. చదువుల కోసం హాస్టళ్లలో ఉంచి, దంపతులిద్దరు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. కొన్ని రోజులుగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే లక్ష్మమ్మ రెండు రోజుల క్రితం గుడిబండలో ఒంటరిగా ఉంటున్న తన తల్లి వద్దకు వచ్చింది. విషయం తెలుసుకొని ఆదివారం గుడిబండకు వచ్చిన కురుమూర్తి.. ఇంటి తలుపులను మూసివేసి, వెంట తెచ్చుకున్న వేట కొడవలితో భార్యను చంపబోయాడు. ఈ క్రమంలో అడ్డువచ్చిన అత్తపై కూడా దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల అరుపులకు స్థానికులు రావడంతో కురుమూర్తి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మమ్మ, నిర్మలమ్మలను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిర్మలమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

ఊరూరా సంత్ గాడ్గేబాబా విగ్రహాలు ఏర్పాటుచేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్వచ్ఛభారత్ పితామహుడు, విద్య ప్రాధాన్యతను చాటిచెప్పి, మూఢ నమ్మకాలను పారద్రోలి దళితులను చైతన్యం చేసిన సంత్ గాడ్గేబాబా మహరాజ్ విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేయాలని ధోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు నడిమింటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాడ్గె బాబాకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సి.రాజు, జిల్లా యూత్ అధ్యక్షుడు శివకుమార్, పట్టణ అధ్యక్షుడు సి.నాగరాజు, యాదగిరి, రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, జిల్లా గౌరవ అధ్యక్షుడు కేతూరి శివన్న, ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి సి.చంద్రమౌళి, జిల్లా ప్రధానకార్యదర్శి సతీష్, యూత్ కార్యదర్శి మనోహర్, పట్టణ గౌరవ అధ్యక్షుడు యాదేశ్‌కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మడెలయ్య నాగేష్, పట్టణ ఉపాధ్యక్షుడు బాలు బండార్ తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాల తయారీ ప్రారంభం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తదితరులు

అమరచింత: స్థానిక పద్మశాలీలు కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏటా పట్టువస్త్రాలు తయారుచేసి అలంకరణ రోజు అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో కురుమూర్తి ఆలయ అర్చకుల సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మగ్గానికి సంఘం గౌరవ అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి నేత పనులు ప్రారంభించారు. పూజా కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా పట్టువస్త్రాల తయారీ పనుల పూజా కార్యక్రమానికి విధిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, క్యామ శ్రీను, పొరుపల్లి చింతన్న, దేవరకొండ మోహన్, పొరుపల్లి శ్రీనివాసులు, చిన్న సీతారాములు, మాగనూర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో కేంద్ర అధికారి


జోగుళాంబ ఆలయంలో అమిత్ శుక్లా

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం కేంద్ర జలశక్తి అభియాన్, గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రటరీ అమిత్ శుక్లా దర్శించుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావుతో కలిసి అలంపూర్ క్షేత్రాన్ని సందర్శించిన ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేయించారు. అనంతరం వారికి క్షేత్ర ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి : కేసు నమోదు

పాన్‌గల్: మద్యం మత్తులో వృద్ధురాలిపై దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. మండలంలోని రేమద్దులకు చెందిన వృద్ధురాలు చెట్టు నాగమ్మ ఈ నెల 25న ఇంట్లో ఉండగా.. అదే గ్రామానికి చెందిన వల్లమోని అశోక్ వృద్ధురాలి ఇంటికి వచ్చి, ఆమె మనవడు నాగరాజు గురించి వాకబు చేశాడు. అయితే వృద్ధురాలు స్పందించకపోవడంతో మద్యం మత్తులో ఉన్న అశోక్.. దుర్భాషలాడుతూ వృద్ధురాలిపై దాడికి పాల్పడ్డాడు. నాగమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం


పురస్కారాలు అందుకున్న పద్మశాలి విద్యార్థులతో నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని అయ్యప్పకొండపై ఉన్న శివ మార్కండేయ దేవాలయంలో ఆదివారం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, నీట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. నగదుతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. అలాగే ఉత్తమ ఉద్యోగులకు, పదవీ విరమణ చేసిన పొందిన పద్మశాలి ఉద్యోగులను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా పద్మశాలి ఉద్యోగుల సంఘం నుంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్నట్లు వివరించారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కడవేరు లక్ష్మీపతి, జిల్లా ఇన్‌చార్జ్ దేవులపల్లి రాజేశ్వర్, బాలరాజు, కెంచె సుభాష్‌చంద్ర, కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి శ్రీనివాస్, దాసు వెంకటేష్, పొల్లటి బాలరాజు, కోడి రాజశేఖర్, కొంగరి వెంకటేష్, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.




కలువల కనువిందు

జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని కృష్ణానదికి వెళ్లే రోడ్డులో చిన్నపాటి కుంటలో కలువ పూలు కనువిందు చేస్తున్నాయి. వికసిస్తున్న తెల్లని కలువ పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆ దారి గుండా వెళ్తున్న పాదచారులు, వాహనదారులను కట్టిపడేస్తున్న కలువల చిత్రాలను ఆదివారం 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

- గద్వాల అర్బన్

జూరాలకు 47వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 4 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి


జూరాల గేట్ల నుంచి విడుదలవుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. శనివారం ప్రాజెక్టుకు 76వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం సాయంత్రానికి 47వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో తెరిచి ఉంచిన 10 గేట్లలో ఆరింటిని మూసివేసి, కేవలం 4 క్రస్టు గేట్ల నుంచి వరదను దిగువకు విడుదల చేశారు. జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 38,043 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. క్రస్టు గేట్ల ద్వారా 16,720, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 71, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 730, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 57,304 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.542 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సుంకేసులలో 4 గేట్ల ద్వారా..

రాజోళి: సుంకేసుల డ్యాంకు 20,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. నాలుగు గేట్లను ఎత్తి 17,648 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. 2,445 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 884.4 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 884.4 అడుగుల వద్ద 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 72,411 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎడమ, కుడిగట్టు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదత్పత్తి చేస్తూ.. 67,558 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 27,000, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,568, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 16.624 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.474 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.